క్లుప్తంగా

2న మండల సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నవంబరు 2వ తేదీన ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అన్నిశాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

20 లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లె : అక్రమంగా సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లె వద్ద స్థానికుడైన పఠాన్‌అజీజ్ (75) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఘనంగా గ్యార్మీ పండుగ


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

వాల్మీకిపురం: స్థానిక హసన్‌ఖాన్‌వీధిలోని హజరత్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో గ్యార్మీ పండుగను ఘనంగా నిర్వహించారు. హజరత్ మహబూబ్ సుభాని స్వామి పేరిట ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దర్గాలో పూల చాదర్‌ను సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆఘా మొహియుద్దీన్, ముస్లింలు సయ్యద్ రియాజ్, అజీమ్, సందాని, జాకీర్, జబ్బార్, మస్తాన్ వలి, నసీర్ హుస్సేన్, కరీం, జవాద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిసంక్షేమ సంఘం కార్యదర్శిగా డాక్టర్ అనిల్‌రెడ్డి



మదనపల్లె : మదనపల్లె రెడ్డిసంక్షేమ సంఘం నూతన కార్యదర్శిగా డాక్టర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధ్యక్షులు డాక్టర్ పి.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఆదివారం బెంగళూరురోడ్డులోని రెడ్డిసంక్షేమ సంఘం భవనంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో సంఘ కార్యదర్శిగా డాక్టర్.అనిల్‌కుమార్‌రెడ్డిని కార్యదర్శిగా ప్రతిపాదించడంతో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి దంతవైద్యులుగా, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం అన్నమయ్యజిల్లా అధ్యక్షులుగా సుపరిచితులు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు సన్నిహితులుగా గుర్తింపు పొందారు. అనిల్‌కుమార్‌రెడ్డికి మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశారదమ్మ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, మాజీ కౌన్సిలర్ బాలగంగాధరరెడ్డి అభినందనలు తెలియజేశారు.

అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలి

పీలేరు: పీలేరు మండలంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ విన్నవించినట్లు జిల్లా మాలమహానాడు ఉపాధ్యక్షుడు జట్టి మల్లికార్జున తెలిపారు. ఆదివారం పీలేరు మండల మాలమహానాడు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా పీలేరు పటణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని మండల, జిల్లా రెవెన్యూశాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్నా స్పందించడం లేదన్నారు. దేశాలు గర్వించదగ్గ రాజ్యాంగ రచన చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ పేరుపై భవన నిర్మాణం కోసం స్థలం కేటాయిండంలో రెవెన్యూ అధికారులు విఫలం కావడంతో వారిపై ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు సుభాస్, ధరణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి కృత్రిమ కాలు

బి.కొత్తకోట: కాలు కోల్పోయిన దివ్యాంగుడికి మానవత సంస్థ ఆదివారం కృత్రిమ కాలును అందజేసింది. షేక్ పీరాన్ సాహెబ్‌కు కుడి కాలు లేదు. ఆయన అవసరాన్ని గుర్తించిన సంస్థ కాలును ఉచితంగా అందించింది. గతంలో బి.కొత్తకోటకు ఒక ఫ్రీజర్‌ను అందించగా కొత్తగా మరోక ఫ్రీజర్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎస్.కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, మంజునాథ్, వాసుదేవరావు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కలకడ : మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండలశాఖ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మనప్రభుత్వం లో భాగంగా సోమవారం కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం, గంగాపురం వడ్డిపల్లె, గంగాపురం, గంగాపురం కురవపల్లె, కత్తివారిపల్లె గ్రామాలలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉంటారని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెరుగుతున్న టమాటా ధరలు

- మార్కెట్లో కిలో టమాటా రూ.30
- ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి తగ్గుతున్న స్టాకు
- 2 వేల నుంచి 300 మెట్రిక్ టన్నులకు పడిపోయిన దిగుబడి
- వారం రోజులు 50 శాతం పెరిగిన టమాటా ధరలు


మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ: జిల్లాలోని మార్కెట్లలో టమాటా ధరలు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా రూ.30 వరకు ధర పలుకుతోంది. గత వారం రోజుల క్రితం కిలోరూ.12 నుంచి రూ.14 వరకు మాత్రమే ఉండేవి. వారం రోజుల్లోనే 50 శాతంకు పైగా టమాటా ధరలు పెరగడం గమనార్హం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో టమాటా తోటలు దెబ్బతిని అక్కడి నుంచి మన జిల్లాకు వచ్చే టామాటాల దిగుబడి 2వేల మెట్రిక్ టన్నుల నుంచి 300 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. దినికి తోడు మన జిల్లాలోనూ టమాటా పంట దిగుబడి ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

18654 ఎకరాల్లో ప్రస్తుత పంట దిగుబడి

జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రస్తుతం 18654 ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది. నెల రోజులుగా అనంతరపుం జిల్లాలో తోటలు దెబ్బతిని పంట దిగుబడి తగ్గిపోయింది. అయితే రాయలసీమ జిల్లాల్లో ముఖ్యంగా మనజిల్లాలో ఎక్కువగా టమాటా పంట సాగుచేస్తుంటారు. పదిహేనురోజుల క్రితం వరకు వైరస్‌లు, ఇతరరోగాలతో జిల్లాలో టమాటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో కొంతవరకు దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం మళ్లీ జిల్లాలో టమాటా దిగుబడులు పెరగడంతో మండీల టమాటాల స్టాకుతో కళకలాడుతున్నాయి.

మార్కెట్‌కు వచ్చిన టమాటాల స్టాకు, ధర

తేదీ	స్టాకు(టన్నుల్లో)	ధర (25 కేజీల క్రేట్)
23.10.23	719	రూ.350
24.10.23	752	రూ.400
25.10.23	769	రూ.500
26.10.23	783	రూ.635
27.10.23	814	రూ.680
28.10.23	826	రూ. 730
29.10.23	850	రూ. 750

పుంజుకొంటున్న ధరలు

ప్రస్తుతం జిల్లాలోని మార్కెట్‌యార్డుల్లో టమాటా ధరలు పుంజుకొంటున్నాయి. వారం రోజుల కిందట కిలో టమాటా రూ.12 నుంచి రూ.14 వరకు ధరలు పలికాయి. 25 కేజీల టమాటా క్రేట్ రూ.300 నుంచి రూ.350 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధరల పుంజుకొవడంతో కిలో టామాటా రూ.30 వరకు ధరలు పలుకుతున్నాయి. 25కేజీల టమాటా క్రేట్ ధర ప్రస్తుతం రూ.750 వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం మొదటి రకం టమాటాకిలో రూ30, రెండోరకం కిలోరూ.24 మూడో రకం రూ.18వరకు ధరలు పలుకుతున్నాయి.

మార్కెట్‌కు తగ్గిన దిగుబడి

పదిహేను రోజుల క్రితం వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి మన జిల్లాకు 2వేల మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు వచ్చేది. జిల్లాలో ములకలచెరువు, అంగళ్లు, మదనపల్లె, గుర్రంకొండ టామటా మార్కెట్లకు ప్రతిరోజూ బయట జిల్లాల నుంచి 2 వేల మెట్రిక్ టన్నుల వరకు టమాటాల స్టాకు వచ్చేది. అక్కడి తోటలు దెబ్బతిని ప్రస్తుతం 300 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మాత్రమే జిల్లాకు వస్తోంది. దీంతో బయట జిల్లాల నుంచి 80 శాతం మేరకు పైనే టామాటాల స్టాకు రావడం తగ్గిపోయింది. దీనికితోడు మన జిల్లాలో ఇప్పుడిప్పుడే టమాటాల దిగుబడి పెరగడం ప్రారంభమయ్యింది.

ధరలు మరింత పెరిగే అవకాశం

ప్రస్తుతం రోజురోజుకు టమాటా ధరలు పుంజుకొంటుండడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి అనంతరపురం జిల్లాలో టమాటాల స్టాకు తగ్గుతుండడంతో రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింతగా పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి


మాట్లాడుతున్న గంగాద్రినాయుడు

వాల్మీకిపురం: సమాజంలోని నిరుపేద ప్రజలను ఆదుకునేందుకే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి మందిరంలో మానవత సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మానవుడిగా మన జీవితానికి పరిపూర్ణత చేకూరాలంటే కుటుంబం, స్వార్థం కాకుండా సమాజం కోసం సేవ చేయాల్సిన ధర్మ ఉందన్నారు. ఇప్పటికే ఫ్రీజర్ బాక్సులు, వైకుంఠ రథం, రోడ్డు పక్కన బల్లలు ఏర్పాటు చేశామన్నారు. పచ్చదనం కార్యక్రమం కింద మొక్కలను నాటే కార్యక్రమాలను చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేశవ రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, శంకర, రమణమూర్తి, లక్ష్మన్న, ఆనందశెట్టి, లక్ష్మీనారాయణ, చంద్రమౌళి, పివినారాయణ, మురళి, సత్య, సివిరమణ తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు విస్తరించాలి

కలకడ : మండలంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అందిస్తున్న ఉచిత సేవలు విలువ కట్టలేనివని, వాటిని మరింత విస్తరించి దాతల దాతృత్వానికి నిదర్శనంగా నిలవాలని ఆ సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, గంగాద్రినాయుడు అన్నారు. ఆదివారం నెలవారి మండల సమీక్ష సమావేశాన్ని మావత కార్యాలయం లో మండల కార్యదర్శి లక్ష్మన్న అధ్వర్యంలో నిర్వహించారు. నెలరోజుల్లో 125 మంది సంస్థలో సభ్యత్వం నమోదు చేసుకున్నారన్నారు. ఉత్తమ వాహన డ్రైవర్‌ను ఎంపిక చేసి నెలవారి రూ.10వేలు చెల్లించడానికి దాతలు ముందుకు వచ్చినట్లు ప్రకటించారు. మావనత విలువలు, విద్యాభివృద్ధికి సంస్థ తరపున ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, మండల శాఖ చైర్మన్ సుధాకర, సెక్రటరీ సయ్యద్‌సాహెబ్, సభ్యులు వైవి రమణ, ఖాజాపీర్, వెంకటేశ్వర, జీవిరమణ, పివి రమణ పాల్గొన్నారు.

మానవత సేవలపై సమావేశం

కలికిరి: మానవత సేవా సంస్థ కలికిరి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలపై ఆదివారం ఇందిరమ్మకాలనిలోని ఆ సంస్థ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంస్థ సేవలను విస్తృతం చేయడంతో పాటు సభ్యులు తీసుకోవాల్సిన బాధ్యతలపై చర్చించారు. కార్యక్రమంలో సంస్థ కలికిరి శాఖ చైర్మెన్ రత్నశేఖర్ రెడ్డి, సభ్యులు ఉత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో రక్తదాన శిబిరం


అంగళ్లులోని కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం

కురబలకోట: పెళ్లంటే సందడి..పందిళ్లు, విందు, వినోదాలు..ఆడంబరాలు..ఉంటాయి. మరో వైపు బంధుమిత్రుల వేడుక. అయితే ఇలాంటి వివాహ వేడుకలో హెల్పింగ్ మైండ్స్ సంస్థ రక్తదాన శిబిరం నిర్వహించి ప్రత్యేకతను చాటుకుంది. సంస్థ సభ్యుడు బషీర్ పెళ్లి ఆదివారం అంగళ్లులోని భారత్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా అతను కొత్త పంథాలో ఆదర్శ కార్యక్రమం నిర్వహించారు. పెళ్లి మండపంలోనే రక్తదాన శిబిరం నిర్వహించారు. పెళ్లికి వచ్చిన అతిథులు, యువకులు పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆసంస్థ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ పదేళ్లుగా రక్తదానం ముఖ్య ఉద్దేశంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పెళ్లిలో ఇలాంటి కార్యక్రమం ద్వారా రక్తదానంపై అవగాహన వస్తుందన్నారు.

హోరా హోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు


చిత్తూరు-విశాఖపట్నం జిల్లా బాలుర బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలు

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ మైదానంలో రాష్ట్ర 67వ అండర్–19 బాల, బాలికల బాస్కెట్ బాల్ పోటీలు హోరీ హోరీగా సాగుగుతున్నాయి. బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం, క్రిష్ణా జిల్లాల జట్లు సెమి ఫైనల్స్‌కు చేరుకున్నారు. బాలికల విభాగంలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జట్లు చేరుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి వివిధ జిల్లాల మధ్య పోటీలు రసవత్తరంగా జరిగాయి. సోమవారం ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు జయరామయ్య, వసంత తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ వి.నాగరాజు, నిర్వాహకులు నరేష్‌బాబు, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, కూరగాయలు వితరణ


బియ్యం,కూరగాయలు అందజేస్తున్న కెజీఎన్ మండి నిర్వాహకులు

మదనపల్లె సిటీ: స్థానిక జెసీఎం చర్చిలో ఆదివారం కెజీఎన్ మండి నిర్వాహకులు దాదాపీర్ పేద మహిళలకు బియ్యం, కూరగాయలు ఉచితంగా అందజేశారు. సుమారు 70 మందికి బియ్యంతో పాటు కూరగాయలు అందించారు. ప్రతి నెలా పేదలకు తన వంతు సహాయ,సహకారాలు అందిస్తున్నట్లు దాదాపీర్ తెలిపారు. కార్యక్రమంలో జనచేతన సంస్థ సిబ్బంది సుల్తానా, జెసీఎం చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బసినికొండ వద్ద హాస్టల్ నందు ఉచితంగా కూరగాయాలు అందజేశారు.

మల్లయ్యకొండకు స్పెషల్ బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లెలో వెలసిన శ్రీ భమరాంబికసమేత మల్లికార్జునస్వామి మల్లయ్యకొండకు సోమవారం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె డిపో నుంచి ఉదయం 5, 6.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ బస్సులు తిరుగుతాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు.

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళాన్ని ఆలయ ఈఓకు అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి కర్నూలుకు చెందిన తలారి వెంకటేష్, వాణి దంపతులు తమ కుమార్తె వెంకట తన్విత పేరుమీద రూ.52,000 విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయ ఈఓ మంజుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. దాతలు ఇచ్చిన డబ్బును వాల్మీకిపురం సప్తగిరిగ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

కోలుకున్న పిడుగుపాటు బాధితులు

కలికిరి: మండల పరిధిలోని మర్రికుంటపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు గురైన బాధితులు కోలుకున్నారు. మర్రికుంటపల్లి గ్రామం కడియాలవారిపల్లికి చెందిన సి.సహదేవయ్య, సి.జయలక్ష్మమ్మ, జే.గణేష్, అక్కరాజమ్మలు పొలం వద్ద పిడుగుపాటుకు గురయ్యారు. వీరిలో సహదేవయ్య, జయలక్ష్మమ్మ పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో కలికిరిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఆదివారం కోలుకుని ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు.

గంగమ్మ గుడిలో చోరీ

సిద్దవటం : మండలంలోని పొన్నవోలు గ్రామంలోని గంగమ్మ గుడిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్ప డ్డారని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ పొన్నవోలు గంగమ్మ గుడిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిలోని హుండీని పగులగొట్టి అందులో ఉన్న దాదాపు రూ. 40వేలు నగదును దొంగలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


వలంటీర్లకు నియామక పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: ఈ నెల 31వ తేదీ మంగళవారం ఉదయం 9గంటలకు స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో 20 కంపెనీలు పాల్గొంటున్నాయని, 18 సంవత్సరాలు పైబడి, 28 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగ యువత హాజరుకావచ్చన్నారు. అభ్యర్థులు ముందుగా వలంటీర్ల వద్ద తమ పేర్లను నమోదు చేసుకొని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో వారి విద్యార్హత జిరాక్స్ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫోటోలు తెచ్చుకోవాలని సూచించారు. అలాగే స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నూతనంగా ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలను అందజేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లు పని చేస్తున్నారని, ప్రభుత్వం అమలు చేసే పథకాలను నేరుగా ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో చింతల ఆనందరెడ్డి, చింతల శివానందరెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



కర్నూలు -చిత్తూరు జాతీయ రహదారిపై రోడ్డు స్టాపర్స్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

కలకడ : రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని సీఐ నాగేంద్ర తెలిపారు . ఆదివారం చిత్తూరు–కర్నూలు జాతీయరహదారిపై, కలకడ–గుర్రంకొండ రోడ్డు మార్గంలో మండలంలోని కె.బాటవారిపల్లె ఉన్నతపాఠశాల, ఇందరమ్మ కాలనీ, టమాట మార్కెట్ వద్ద కలకడ టమాట వ్యాపారులు వితరణ చేసిన 25 రోడ్డు స్టాపర్స్‌ను రోడ్డుపై వాహన రాకపోకలకు సమస్య రాకుండా, అతివేగం నివారణ కోసం ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహన దారులు హెల్మెంట్ ధరించాలన్నారు. ఫోర్‌వీలర్ వాహనాలను నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచనలు చేశారు. మండల పరిధిలో నిత్యం వాహన తనిఖీలు నిర్వహించి లైసెన్స్ లేని చిన్నారులకు వాహనాలు ఇచ్చినా వారి పెద్దలపై కేసులు, అనుమతికి మించి తరలించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి కుటుంబానికి శుద్ధి చేసిన నీరు

పీలేరు: ప్రతి కుటుంబానికి శుద్ధిచేసిన నీరును అందించడమే లక్ష్యమని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్‌షఫీ అన్నారు. ఆదివారం మండలంలోని కావలిపల్లె అగ్నిమాపకకేంద్రం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు పట్టణంలో రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్‌రెడ్డి , ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో పీలేరు పట్టణంలో మాత్రం 40ఆర్‌ఓ ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం ద్వారా రోజు ప్రతికుటుంబానికి ఉచితంగా 50 లీటర్లు శుద్ధిచేసిన మంచి నీటిని అందించడం జరుగుతుందని గుర్తు చేశారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఆనంద్, వార్డుసభ్యులు ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకుందాం


మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు రమణ

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగులంతా కలసి కట్టుగా సమస్యలను పరిష్కరించుకుందామని విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు రమణ అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట వీధిలో ఏర్పాటు చేసిన తాలూకా విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఉమ్మడి పోరాటం చేస్తామన్నారు. మన సంఘంలో ఎవ్వరికైనా సమస్యలు తలెత్తితే, ఆ సమస్యలను విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తోందన్నారు. సంఘంలో సభ్యులకు ఏ సమస్యలున్నా సంఘం దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి సంఘం సభ్యులు అందరూ కలసి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ మేనేజర్ శివకుమార్, ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, విశ్రాంత ఉద్యోగులు శంకరయ్య, నారాయణ, మస్తాన్, శంకర్ రెడ్డి, రామమూర్తి నాయుడు, రాజగోపాల్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్కీనేపల్లెకు దశాబ్దాల తర్వాత రోడ్డు


రోడ్డు పనులు చేపట్టిన దృశ్యం

కురబలకోట: మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీలో మారు మూల గుట్ట ప్రాంతంలో ఉన్న లక్కీనేపల్లె, ఎగువపాళెంకు దశాబ్దాల తర్వాత రోడ్డు సౌకర్యం ఏర్పడుతోంది. ఈ పల్లెలు అక్కడక్కడా విసిరేసినట్లుగా ఉన్నాయి. ఆరోగ్యపురం నుంచి ఎగువపాళెం, లక్కినేపల్లె, మేకలవారిపల్లె వరకు మూడు కిలో మీటర్ల మేర రూ.2.70 కోట్లతో ఏకంగా తారు రోడ్డు పనులు సర్పంచ్ కోళ్ళ విమలమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇన్నేళ్లుగా వీరికి కాలి బాట తప్ప మరో దారి లేదు. రోడ్డు లేని వీరు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులతో ఇరుకు దారి మధ్య కాలం గడుపుతూ వచ్చారు. గత ప్రభుత్వంలో కనీసం మట్టి రోడ్డు కోసం ప్రాదేయపడ్డా పట్టించుకున్నవారులేరు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఈ గ్రామాలను ఇటీవల సందర్శించినప్పుడు మాట ఇచ్చారు. అది వెంటనే ఇప్పుడు నెరవేరుతోందని ఆ గ్రామ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మండల పార్టీ కన్వీనర్ కోళ్ల వాసుదేవరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి


పీలేరు డిపో వద్ద ఆర్టీసీ సిబ్బంది నిరసన

పీలేరు రూరల్: రెండు రోజుల క్రితం విజయవాడ టోనగర్ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ డ్రైవర్ రామసింగ్ పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని పీలేరు ఆర్‌టీసీ డిపో ఎన్‌యంయూ, ఎంప్లాయీస్‌యూనియన్, వైఎస్సార్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీలేరు ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌యంయూ జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాతూ బెంగళూరు–విజయవాడ సర్వీసులో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌పై కావళి వద్ద దాడిచేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. భవిషత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సివి రమణ, ఖాదర్‌బాష, నాగరాజ, చంద్ర, వలీ, ఆర్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వరాలతల్లీ ..కరుణించమ్మా..!


సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేకువజామునే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు. పలువురు భక్తులు ఆలయమెట్లకు పూజలు నిర్వహించి మోకాళ్లపై నడుచుకొంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు.